# రెండ్రోజుల్లో నోటిఫికేషన్

## కానిస్టేబుళ్ల నియామకంపై డీజీపీ



నక్కపల్లి/ఏలూరు అర్బన్/ఒంగోలు క్రైం: మరో రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పదివేల కానిస్టేబుళ్ల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తామని డీజీపీ జె.వి.రాముడు తెలిపారు. ప్రక్రియ అంతా పూర్తయిందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విశాఖ జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోటలో రూ.49 లక్షలతో నిర్మించిన మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరప్రాంతాల్లో భద్రత పటిష్టం చేసేందుకు తీర ప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్ల దూరానికి ఒక మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను సముద్ర తీరంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బుధవారం ఏలూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పలు అంశాల్లో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. విభజన అంశాలకు సంబంధించి పోలీస్ శాఖ పరంగా పలు అంశాల్లో స్పష్టత రాలేదని, ఉద్యోగుల కేటాయింపు పూర్తయితే తెలంగాణ నుంచి చాలామంది పోలీసులు రాష్ట్రానికి వస్తాన్నారు. ఏలూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆయనప్రారంభించారు. అనంతరం ప్రకాశం జిల్లా కొత్తపట్నం, రామాయపట్నం తీరాల్లోని మెరైన్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు.